ప్రజాశక్తి
శనివారం 3 డిసెంబర్ 2022 5 విజయనగరం



## నాగళ్లవలస మీదుగా చీపురుపల్లికి ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి-గుర్ల

తోండ్రంగి నుంచి విజయనగరం వయా గుజ్జంగివలస, నాగళ్లవలస, తోండ్రంగి మీదుగా చీపురుపల్లికి ఆర్టీసీ బస్సు శుక్రవారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. ఇటీవల నాగళ్లవలసలో గ్రామ సచివాలయ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థులు తమ గ్రామానికి బస్సు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. మంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి బస్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ బస్సు సర్వీసులు ఉదయం, సాయంత్రం రెండు పూటలా అందుబాటులోకి వస్తాయని డిపిటిఒ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ జి.బంగారమ్మ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బస్సులో ప్రయాణిస్తున్న మంత్రి బొత్స

# అధ్యయనం.. పోరాటం

- విద్యారంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ పోరుబాట
- సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలపై నిరసనలు
- నిర్బంధాలు ఎదుర్కొంటూ ఎయిడెడ్ విద్యాసంస్థల పరిరక్షణకు కృషి
- ఫీజుల పెంపుపైనా ఉద్యమాలు
- నేడు బొబ్బిలి కేంద్రంగా ఎస్‌ఎఫ్‌ఐ 30వ జిల్లా మహాసభలు

చదువుతూ పోరాడు... చదువుకై పోరాడు... అనే నినాదంతో ఏర్పాటైన ఎస్‌ఎఫ్‌ఐ విద్యారంగ సమస్యల పరిష్కారానికి విస్తృతమైన పోరాటాలు చేస్తూ విద్యార్థిలోకానికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఓవైపు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, మరోవైపు పాఠశాలలు, కాలేజీలు, వసతిగృహాల్లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తోంది. గడిచిన ఏడాది కాలంలో కేవలం విద్యార్థుల సమస్యలు, విద్యారంగ పరిరక్షణకే పరిమితం కాకుండా నిరుద్యోగుల సమస్యలపై అధ్యయనం, పుస్తకాల విక్రయం, పోటీ పరీక్షల నిర్వహణ వంటి బహుముఖపాత్రను పోషిస్తూ ముందుకు సాగింది. ఈక్రమంలో ఈనెల 3, 4తేదీల్లో (శనివారం, ఆదివారాల్లో) జిల్లా మహాసభకు సిద్ధమైంది. బొబ్బిలి కేంద్రంగా రెండు రోజులపాటు నిర్వహించబోయే మహాసభకు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, సహాయ కార్యదర్శి పిహెచ్.పావని, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.విజయగౌరి ముఖ్య వక్తలుగా హాజరు కానున్నారు. పాతబస్టాండ్‌కు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి తాండపాపారాయుడు కూడలి వరకు విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించనున్నారు. అనంతరం అక్కడ బహిరంగ సభ జరగనుంది. గంటి ప్రసాదం స్మారక భవనంలో ప్రతినిధుల సభ, గత కార్యక్రమాల సమీక్ష, కార్యవర్గ ఎన్నికలు జరుగుతాయి. ఈనేపథ్యంలో గడిచిన ఏడాదిలో ఎస్‌ఎఫ్‌ఐ చేపట్టిన పోరాటాలు, నిర్బంధాలను గుర్తు చేసుకుంటే..

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కరోనా కారణంగా మూతపడిన వసతి గృహాలను విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి తెరిపించాలని జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఫలితంగా రాష్ట్రంలో ఎక్కడా లేనంతగా మన జిల్లాలో విద్యాసంవత్సరం ప్రారంభం నాటికే హాస్టల్స్ తెరుచుకున్నాయి. హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవడం కోసం సర్వేలు చేపట్టారు. దీంతో, మెనూ అమలు మెరుగుపడింది. నూతన విద్యావిధానం పేరిట ప్రాథమిక పాఠశాలల మూసివేత తగదంటూ జిల్లా అంతటా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టింది. దీంతో, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భాగస్వామయ్యారు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 86స్కూళ్లను ప్రభుత్వం యథాతథంగా కొనసాగించడం తప్పలేదు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ జిల్లాలో సాగిన బస్సుయాత్ర విజయవంతమైంది. ఈ సందర్భంగా 40మంది కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసినా యాత్ర నిరాటంకంగా సాగింది. ఎయిడెడ్ విద్యాసంస్థలను ప్రభుత్వ రంగంలోకి విలీనం చేయడం లేదా యథాతథంగా నడపాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున ఎస్‌ఎఫ్‌ఐ ఉద్యమించింది. ఎంఆర్ (ఎ) కాలేజీ, కోటలోని ఎంఆర్ కాలేజి రక్షణకోసం పెద్దఎత్తున ఉద్యమించారు. అధికంగా పెంచిన ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ నిర్బంధాలను అధిగమిస్తూ పెద్దఎత్తున పోరాడారు. దఫదఫాలుగా మానవహారాలు, ర్యాలీలు, చలోకలెక్టరేట్‌లు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీల్లో ఉపాధ్యాయులు, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని రెండు సార్లు చలో కలెక్టరేట్ నిర్వహించారు. అంతకు ముందుకు మండలం, డివిజన్ స్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఫలితంగా చాలా వరకు సమస్యలు పరిష్కారమయ్యాయి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలు గాలికి వదిలి, పెద్దఎత్తున పుస్తకాలు పేరుతో వ్యాపారం మొదలుపెట్టడాన్ని ప్రతిఘటించింది. ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ఫీజులు పెంపు, కాండినేషన్ పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెట్టడం వంటి సందర్భాల్లో ఎస్‌ఎఫ్‌ఐ నాయకత్వం ఎక్కడికక్కడ స్పందించి విద్యార్థులకు ఆసరాగా నిలిచింది.

నిరుద్యోగుల సమస్యలపై ఎత్తున పోరాడాడింది. నూతన జాబ్ క్యాలెండర్ విడుదల చెయ్యాలని ఖాళీపోస్టులు భర్తీకి పెద్ద ఎత్తున అన్ని సంఘాలను కలుపుకొని ఉద్యమించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు అడ్మిషన్ల సమయంలో పట్టణాల్లో ఇబ్బందులు ఎదుర్కోకుండా చాలా కళాశాలల్లో హెల్ప్ డెస్కులు నిర్వహించింది. టెన్త్, ఎంసెట్ మోడల్ పరీక్షలు, సైన్స్‌డే, అల్లూరి జయంతి, భగత్‌సింగ్, రక్షాబంధన్, అంతర్జాయతీయ మహిళాదినోత్సవాలు, రక్తదాన శిబిరాలు, కోవిడ్ బాధితులకు పలురూపాల్లో సేవలందించడం వంటి స్ఫూర్తిదాయకమైన, చైతన్యవంతమైన కార్యక్రమాలు చేపట్టింది.

## కలుషిత ఆహారం తిని 12 మంది విద్యార్థినులకు అస్వస్థత

- ఆస్పత్రిలో చికిత్స.. కోలుకున్న బాలికలు
- పరామర్శించిన డిఎంహెచ్‌ఒ, ఆర్‌డిఒ, డిసిహెచ్‌ఎస్

ప్రజాశక్తి -శృంగవరపుకోట

మండలంలోని తాటిపూడి ప్రభుత్వ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో గురువారం రాత్రి విద్యార్థినులు తిన్న ఆహారం కలుషితం కావడంతో 12 మంది కడుపునొప్పి, వాంతులు బారిన పడి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిలో తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్న 10 మంది విద్యార్థినులను చికిత్స నిమిత్తం స్థానిక ప్రాంతీయ ఆసుపత్రికి కళాశాల సిబ్బంది తరలించారు. ఉదయానికి నలుగురి ఆరోగ్యం కుదుట పడడంతో వెంటనే కళాశాలకు పంపించేశారు. మిగతా ఆరుగురు విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి కూడా కుదుటపడిందని , ఎటువంటి అపాయమూ లేదని సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.వి.సత్యశేఖర్ తెలిపారు. కాలేజీ ఆవరణలో కూడా వైద్య శిబిరం కొనసాగిస్తున్నట్టు కొట్టాం పిహెచ్‌సి వైద్యాధికారి లావణ్య తెలిపారు. ఇదిలావుండగా కళాశాలలో 170 మంది విద్యార్థినులు, అధ్యాపకులు, సిబ్బంది అందరూ ఇదే భోజనాలను చేశారని, వీరిలో కొద్దిమంది మాత్రమే అస్వస్థతకు గురయ్యారని, ఏమై ఉంటుందో అర్థం కావటం లేదని ప్రిన్సిపాల్ శారదాబాయి వ్యాఖ్యానించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను డిఎంహెచ్‌ఒ ఎస్‌వి రమణకుమారి, డిసిహెచ్‌ఎస్ నాగభూషణరావు, ఆర్‌డిఒ సూర్యకళ, తహశీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పరామర్శించారు. వైద్యాధికారులతో మాట్లాడి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో కొండరపు నవదేవిక, బంగారు లాజ్ ఓనిజాయ్, పాలు వెంకట జయశ్రీ, అవిత వైష్ణవి ప్రియ, పొలవలస శ్యామలత, బొగ్గు రమ్య ఉన్నారు.

విద్యార్థులను పరామర్శిస్తున్న ఆర్‌డిఒ సూర్యకళ

## జీడి, అరటి పంటలకు బీమా

- జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- స్థాయీసంఘ సమావేశాల్లో పలు అంశాలపై చర్చ

**విజయనగరం :** రెండు జిల్లాల్లో జీడి, అరటి పంటలకు బీమా సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామని జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు అవసరమైన గోనె సంచులను సరఫరా చేస్తామని అన్నారు. జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలను, ఆయా సంఘాల ఛైర్మన్ల అధ్యక్షతన జెడ్‌పి సమావేశ భవనంలో శుక్రవారం వరుసగా నిర్వహించారు. ముందుగా జరిగిన 3వ స్థాయి సంఘ సమావేశంలో, వ్యవసాయం, ధాన్యం సేకరణ అంశాలపై జరిగిన చర్చ సందర్భంగా జెడ్‌పి ఛైర్మన్ మాట్లాడుతూ, గోనెసంచుల కోసం రైతులు ఆందోళన చెందవద్దని, కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో జీడి పంటకు, పార్వతీపురం జిల్లాలో అరటి పంటకు బీమా సదుపాయం ఉందని చెప్పారు. ఈ రెండు పంటలకూ రెండు జిల్లాల్లో బీమా సదుపాయాన్ని కల్పించేందుకు, సమగ్ర వివరాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. జెడ్‌పి వైస్ ఛైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు, పలువురు ఇతర సభ్యులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఎక్కడా మిల్లర్ల ప్రమేయం లేకుండా, అత్యంత పారదర్శకంగా ప్రభుత్వం కొత్తవిధానాన్ని తీసుకువచ్చిందని అన్నారు. సమావేశాల్లో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్‌సి డాక్టర్ పి.సురేష్‌బాబు, బొబ్బిలి ఎంఎల్‌ఎ శంబంగి వెంకట చినప్పలనాయుడు, 6వ స్థాయి సంఘ ఛైర్మన్ కొర్రజన్ని సింహాచలం, 5వ స్థాయి సంఘ ఛైర్మన్ సంకిలి శాంతకుమారి, జెడ్‌పి సిఇఒ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, రెండు జిల్లాల వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

## అభివృద్ధికి గ్రామస్థాయి ప్రణాళికలు

ప్రజాశక్తి-విజయనగరం

గ్రామస్థాయి అభివృద్ధి ప్రణాళికల్లో, ప్రజల ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి సూచించారు. దీనికి ప్రజాప్రతినిధులంతా సహకరించాలని కోరారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్తు స్థాయి అభివృద్ధి ప్రణాళికల తయారీపై, జెడ్‌పిటిసిలకు, ఎంపిపిలకు, అధికారులకు స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో శుక్రవారం శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ప్రజల ఆదాయాభివద్ధి కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. గ్రామకంఠాల్లో కొంత స్థలాన్ని సామాజిక అవసరాల కోసం విడిచిపెట్టాలని, అలాంటి చోట నర్సరీలు, ఇతర ఆదాయాన్ని పెంచే కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. బడి ఈడు పిల్లలంతా, తప్పనిసరిగా బడికి వచ్చేవిధంగా, ప్రజలను స్థానిక ప్రజాప్రతినిధులు చైతన్య పరచాలని కోరారు. జిల్లాలో మహిళల్లో రక్తహీనత ఎక్కువగా ఉందని, దీని నివారణకు పోర్టిఫైడ్ రైస్‌ను వినియోగించేలా చూడాలన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా, థాలసీమియా లాంటి రక్త సంబంధి వ్యాధులు కూడా ఎక్కువగా కనిపిస్తున్నాయని చెప్పారు. జిల్లాలో సుమారు 58శాతం ప్రసవాలు సిజేరియన్‌ల ద్వారా జరుగుతున్నాయని, ఇది అంత శ్రేయస్కరం కాదని సూచించారు.

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్థానిక ప్రభుత్వాలు తమ ప్రజల అభివృద్ధికి తామే అభివృద్ధి ప్రణాళికలను రూపొందించు కొనేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందని చెప్పారు. ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ ప్రాంతీయ ఆసుపత్రులకు వచ్చే అత్యవసర రోగులను, అవసరమైన పక్షంలో జిల్లా ఆసుపత్రులకు నేరుగా రిఫర్ చేసే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్‌సి డాక్టర్ పి.సురేష్‌బాబు, బొబ్బిలి ఎంఎల్‌ఎ శంబంగి వెంకట చినప్పలనాయుడు, జెడ్‌పి వైస్ ఛైర్మన్లు మరిశర్ల బాపూజీనాయుడు, కె.సింహాచలం, సిఇఒ ఎం.అశోక్‌కుమార్, డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, రెండు జిల్లాల జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సారికలో 7న ఇళ్ల పట్టాలు పంపిణీ

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేదలందరికీ ఇళ్ల పథకం కింద విజయనగరం నియోజకవర్గంలో రెండో విడత ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ జరుగుతుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి తెలిపారు. ఈనెల 7న సారిక గ్రామంలో పట్టాల పంపిణీ జరుగుతుందని చెప్పారు. న్నారు. ఈ కార్యక్రమం ఏర్పాట్లపై డిప్యూటీ స్పీకర్ మేయర్ విజయలక్ష్మి తో కలసి శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్‌డిఒ సూర్య కళ, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు నాయుడుతో సమీక్షించారు. సారిక లే అవుట్‌లో 3569 ఇళ్ళ స్థలాలను గుర్తించామన్నారు. వాటిలో 47 వార్డులకు సంబంధించిన 3455 మంది అర్హులైన లబ్ధిదారులకు కేటాయించామన్నారు. ఈనెల 7న వారందరికీ పట్టాలను అందజేయనున్నట్లు తెలిపారు. వార్డుల వారీ లబ్ధిదారుల జాబితాలను కార్పొరేటర్లకు అందజేయాలని మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. సచివాలయం ద్వారా లబ్ధిదారుల వెరిఫికేషన్ జరగాలని, ఇచ్చిన అడ్రస్ నందు లబ్ధిదారుడు ఉన్నదీ లేనిదీ తనిఖీ చేయాలని తెలిపారు. మున్సిపల్ కమీషనర్ శ్రీరాములు నాయుడు ఏర్పాట్ల పై వివరించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ రేవతీ దేవి, కార్పొరేటర్లు, ఎంపిపి మామిడి అప్పల నాయుడు, తహశీల్దార్ బంగార్రాజు, హౌసింగ్ డిఇ, ఎఇలు పాల్గొన్నారు.

**అభివృద్ధే ధ్యేయంగా కార్యక్రమాలు**

నగర అభివృద్ధే ధ్యేయంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. శుక్రవారం స్థానిక మయూరి జంక్షన్లో రూ.4.22 కోట్లతో నిర్మిస్తున్న రహదారికి ఆయన శంకుస్థాపన చేశారు. మయూరి హోటల్ నుంచి బాలాజీ జంక్షన్ వరకు ఆర్‌అండ్‌బి ఆధ్వర్యంలో నిర్మించనున్న రహదారికి శ్రీకారం చుట్టారు. మయూరి నుండి బాలాజీ వరకు ఆరు లైన్ల రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. త్వరలోనే కలెక్టరేట్ నుంచి కంటోన్మెంట్ రోడ్డును కూడా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. సమస్యను పరిష్కరించి కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి ,డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతి దేవి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ , స్థానిక కార్పొరేటర్ భోగాపురపు లక్ష్మి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న డివైఎఫ్‌ఐ నాయకులు, యువకులు

## వయోపరిమితి పెంచాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎస్‌ఐ, కానిస్టేబుల్ పోస్టుల నోటిఫికేషన్‌లో వయోపరిమితి ఐదేళ్లు పెంచాలని, పరీక్ష గడువు కాలాన్ని పెంచాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద డివైఎఫ్‌ఐ అధ్వర్యంలో యువకులు ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ హరీశ్, ఎన్.రుద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎస్‌ఐ కానిస్టేబుల్ పోస్టుల వయోపరిమితి ఐదేళ్లు పెంచాలని, రాత పరీక్ష సమయం పెంచాలని కోరారు. ఇందులో ఫైర్, జైలు వార్డెన్ల ప్రస్తావనేలేదని, నాలుగేళ్లగా ఎదురు చూస్తున్న నిరుద్యోగుల ఆశాలు నిరాశలయ్యాయని అన్నారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకొని రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్‌ఒను కలిసి వినతి అందజేశారు. కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సతీష్ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సతీష్, బాలాజీ, నిరుద్యోగులు సురేష్, శివాజీ, వాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ఛైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు

## రాజా కళాశాల విద్యార్థులకు పతకాల పంట

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక రాజా కళాశాల విద్యార్థులు గతనెల 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్‌లో 3 బంగారు, ఒక సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా వారిని కళాశాల ఛైర్మన్ ఆర్‌వి సుజయ్‌కృష్ణ రంగారావు, సంయుక్త కార్యదర్శి ఆర్.బదరీ, ప్రిన్సిపల్ చల్లా వీరేంద్ర కుమార్ అభినందించారు. అథ్లెటిక్స్‌లో బంటు త్రివేణి షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో బంగారు పతాకాన్ని గెలుచుకుంది. కె. కృష్ణవేణి 20 కిలోమీటర్ల వాక్‌లో బంగారు పతాకాన్ని సాధించింది. వై.గంగులు 400 మీటర్ల హార్డిల్‌లో సిల్వర్ పతకాన్ని సాధించారు. వీరిని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జి.ప్రభాకర రావు, ఫిజికల్ టీచర్ జెఎస్ శ్రీనివాస్ కూడా అభినందించారు.

## గ్రీన్‌అంబాసిడర్ల రాస్తారోకో

ప్రజాశక్తి-దత్తిరాజేరు

గ్రీన్‌అంబాసిడర్ల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని మానాపురం సంతోట వద్ద సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఈ రాస్తారోకోను ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో 2300 మంది గ్రీన్‌అంబాసిడర్లు పనిచేస్తున్నారని, 9 నెలలుగా జీతాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అనేకసార్లు కలెక్టర్‌కి విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మార్చి నెల వరకు జీతాలు వేశారని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి పంచాయతీ సర్పంచులు జీతాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం చేసింది కానీ తమ వద్ద ఆదాయం లేదని సర్పంచులు చేతులెత్తేస్తున్నారని చెప్పారు. జిల్లాలో 9 నెలల నుంచి 20 నెలల వరకు జీతాలు బకాయిలు ఉన్నాయని వెల్లడించారు. రాష్ట్రంలో ఇన్ని నెలల జీతాలు బకాయితో పనిచేస్తున్న కార్మికులు ఎవరైనా ఉన్నారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దళితులు, పేదలే ఉద్దేశంతో ఈ గ్రీన్‌అంబాసిడర్ల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. 2020 అక్టోబర్‌లో రూ.10 వేలు చొప్పున గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా నేటికీ అమలు చేయలేదన్నారు. ఇప్పుడు ఇస్తున్న రూ.6 వేలు జీతం కూడా సరిగా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఇప్పటికైనా సిఎం జగన్ మోహన్ రెడ్డి స్పందించి వెంటనే గ్రీన్ అంబాసిడర్ల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేలు వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లావ్యాప్తంగా పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల సంఘం జిల్లా కమిటీ సభ్యులు కె.నూకరాజు, మండల అధ్యక్షులు జి.నరసింహమూర్తి, పి.గౌరీ, రమేష్, టి.సూరమ్మ, డి.గురువులు తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు, సిఐటియు నాయకులు

## జయహో బిసి మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 8న విజయవాడలో జరుగనున్న బిసి మహాసభను జయప్రదం చేసేందుకు శుక్రవారం జిల్లా వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ ఆధ్వర్యాన విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లోని ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సిలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జయహో బిసి మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర గారు, శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

## గ్రోత్ సెంటర్ పరిశ్రమల్లో స్థానికులకు మొండి చెయ్యి

**సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు**

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి, పరిసర గ్రామాల ప్రజలకు ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేసిన గ్రోత్ సెంటర్‌లోని పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు అన్నారు. గ్రోత్ సెంటర్, పరిసర గ్రామాల్లో శుక్రవారం సిఐటియు నాయకులు ఎస్.గోపాలంతో కలిసి పర్యటించారు. గ్రోత్ సెంటర్లో కాలుష్యాన్ని వెదజల్లే ఫెర్రో పరిశ్రమలు ఏర్పాటు చేసినప్పటికీ స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫెర్రో వ్యర్థాలు రోడ్లుపైన, రోడ్ల పక్కన పడేస్తే వాటిలో ఉన్న ముడి సరుకును ఏరుకుని పాత ఇనుము షాపులలో అమ్ముకుని జీవనం సాగించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులకు న్యాయం చేయాల్సిన పాలక పార్టీలు కాంట్రాక్టులు, ప్రతినెల మాములు తీసుకుని యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఫెర్రో పరిశ్రమలలో కార్మికులు మరణిస్తే ఆయా కుటుంబాలను ఆదుకోవడం లేదన్నారు. పది నెలల క్రితం బెర్రీ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంలో మరణించిన, గాయపడిన కార్మికుల కుటుంబాలను ఆదుకోలేదన్నారు. పరిశ్రమలలో కార్మిక చట్టాలను అమలు చేయడం లేదన్నారు. దీంతో కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులకు ఉపాధి కల్పించాలని, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, కాలుష్యాన్ని నియంత్రించాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరాటం చేస్తామన్నారు.

రోడ్డుపై ఫెర్రో వ్యర్థాలను ఏరుకుంటున్న మహిళలతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు

## మహిళా ఈతకొలను త్వరలో ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రకాశం పార్కులో నిర్మించిన రాష్ట్రంలోనే తొలి మహిళా ఈతకొలనును త్వరలో ప్రారంభించనున్నట్లు మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తెలిపారు. స్విమ్మింగ్ పూల్, పిల్లల క్రీడా ప్రాంగణాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శుక్రవారం పరిశీలించారు. నాణ్యమైన నిర్మాణాలతో పాటు, ఆహ్లాదకర వాతావరణం ప్రతిబింబించే విధంగా పరిసరాలను రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. కోటి 80 లక్షల రూపాయలతో పార్కును అభివృద్ధి చేసి, పిల్లల క్రీడా ప్రాంగణాన్ని మహిళల కోసం ప్రత్యేకంగా స్విమ్మింగ్ పూల్ ను ఏర్పాటు చేశామన్నారు. నగర సుందరీకరణలో భాగంగా ఇప్పటికే అనేక ప్రాంతాలు అభివృద్ధి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, కార్పొరేటర్ బండారు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని చొల్లంగిపేట ఆర్‌బికె వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎంపిపి బంటుపల్లి వెంకట సత్య వాసుదేవరావు, పిఎసిఎస్ ఛైర్మన్ రొంగలి కనకసింహాచలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా రైతు భరోసా కేంద్రంలో ధాన్యం విక్రయించాలని సూచించారు. రైతులు ధాన్యం అమ్మిన 21 రోజుల్లో వారి ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మి నాయుడు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పతివాడ సత్యనారాయణ, సర్పంచ్ కోరాడ కనకరాజు, ఎంపిటిసి గుడివాడ కిరణ్ కుమార్, రామతీర్థం బోర్డు సభ్యుల: దాట్ల సత్యనారాయణ రాజు, డి.కొల్లం సర్పంచ్ అట్టాడ శివకృష్ణ, నాయకులు బుచ్చిరాజు, టి.శ్రీనివాసరావు ఉపసర్పంచ్ కృష్ణ వర్మ రాజు, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి వాసుదేవరావు

## రెడ్‌క్రాస్‌కు వాకాడ విరాళం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా రెడ్‌క్రాస్ సంస్థకు గరివిడి జెడ్‌పిటిసి సభ్యులు వాకాడ శ్రీనివాసరావు రూ.40వేల విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్నిజిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారికి జెడ్‌పి సమావేశ మందిరంలో శుక్రవారం అందజేశారు. శ్రీనివాసరావు కొద్దినెలల ముందు కూడా రెడ్‌క్రాస్‌కు రూ.10వేల విరాళాన్ని అందించారు. విరాళాన్ని అందజేసిన శ్రీనివాసరావును కలెక్టర్ సూర్యకుమారి అభినందించారు.

## జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి-గరివిడి

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి ఎస్.దీరజ్ యాదవ్.. లెండి కళాశాలలో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో సత్తాచాటాడు. ఈ నెల ఏడో తేది నుంచి బెంగళూరులో జరిగే దక్షణాది రాష్ట్రాల అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నాడు. దీరజ్‌ను కాలేజీ ప్రిన్సిపల్ వి.జాషువ జయప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో ఎఒ అనిల్‌కుమార్, పీడీ వడ్డాది వెంకట కుమార్, ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

**నెల్లిమర్ల :** నగర పంచాయతీకి చెందిన పొట్నూరు నితిన్ కుమార్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ఆరిపాక శోభనాచారి తెలిపారు. జెఎన్‌టియులో మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్న నితిన్ కుమార్ జాతీయ పోటీలకు ఎంపికవడం పట్ల ప్రిన్సిపల్ ఎ.శ్రీకుమార్, పీడీ కె.నాగరాజు అభినందించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



## రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

**బొబ్బిలి :** మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి తాగునీటికి పెద్దపీట వేసిందని తెలిపారు. కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ చోడిగింజ రమేష్ నాయుడు, 5వ వార్డు కౌన్సిలర్ వెలగాధ హైమవతి, మున్సిపల్ డిఇఇ రవికుమార్ పాల్గొన్నారు.

## పశు వైద్యులను నియమించాలి

**వంగర :** వంగర, పెద్దరాజులగుమ్మడ పశు వైద్య కేంద్రాలకు వైద్యులను నియమించాలని వంగర ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ అధికారులను కోరారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. మండలంలో రెండు పశు వైద్య కేంద్రాలు ఉన్నప్పటికీ వైద్యులు లేకపోవడంతో పాడి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి వంగర మండలానికి ఇద్దరు పశు వైద్యులు నియమించాలని కోరారు.

## లింగ వివక్షతపై గ్రామాల్లో ర్యాలీలు

**రేగిడి:** లింగ వివక్షతకు ఇక ముగింపు తప్పదని రాజాం క్లస్టర్ స్త్రీనిధి మేనేజర్ భాస్కర్‌రావు, ఎపిఎం మంగమ్మ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని వావిలవలస, కొండవలస, మీసాల దోలపేట తదితర గ్రామాల్లో లింగ వివక్షతపై ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడ, మగ సమానమేనని తెలిపారు. ప్రస్తుత సమాజంలో ఆడపిల్ల నయమని అన్నారు.

వాలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఎంపిడిఒ, తహశీల్దార్

## వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

**రేగిడి :** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఖాళీగా ఉన్న వాలంటీర్ల పోస్టులకు ఎంపిడిఒ గన్నవరపు కాశీవిశ్వనాథరావు, తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని కోడిశలో మూడు, అంబాడ వెంకటాపురంలో ఒక వాలంటీర్ పోస్టు ఖాళీగా ఉండటంతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నట్లు వారు తెలిపారు. వీరితోపాటు ఎం.నాగభూషణరావు ఉన్నారు.

## చిత్రలేఖనంలో ధర్మవరం విద్యార్థి ప్రతిభ

**శృంగవరపుకోట :** ఆగస్టులో ముంబయికి చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్స్ సంస్థ నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఐదో తరగతి విద్యార్థి కిలారి శ్యామసుందర్ ప్రతిభ కనబరిచాడు. ఆ పోటీల్లో బంగారు పతకం గెలుచుకున్నట్లు ఇన్‌ఛార్జి హెచ్ఎం రహీం షేక్ లాల్ తెలిపారు. శ్యామసుందర్ తండ్రి కిలారి పాపారావు కంటకాపల్లి ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. శ్యామసుందర్‌ను రహీం షేక్ లాల్, ఉపాధ్యాయులు అఖిలా రాణి, బి.కమల, రూప, శ్రీను, పీడీ పొట్నూరు శ్రీరాములు అభినందించారు.

## 12వ వేతన సంఘాన్ని నియమించాలి

**రామభద్రపురం :** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే సిపిఎస్ రద్దు చేసి,పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, వేతన సవరణ, పింఛను కన్సాలిడేషన్ కోసం 12వ వేతన సంఘాన్ని వెంటనే నియమించాలని ఎపిటియఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మడక బలరాంనాయుడు డిమాండ్ చేసారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చి మూడున్నరేళ్లయినా అమలు చేయకపోవడం అన్యాయమని అన్నారు. సమావేశంలో ఎపిటియఫ్ జిల్లా కార్యదర్శి కె.సత్యారావు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరా బంద్

**బొబ్బిలి :** బొబ్బిలి మున్సిపాలిటీలో బలిజిపేట రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను పలు ప్రాంతాల్లో నిలిపివేయనున్నట్లు ఇఇ పూడి హరి తెలిపారు. స్టెల్ బజార్ వద్ద నుండి అమ్మిగారి కోనేరు గట్టు వరకు, పాత బొబ్బిలి, సంఘవీధి , దావాల వీధి, అంట్యాకుల వీధి , దిబ్బ వీధి, సిరిపురపు వీధి పరిసర ప్రాంతాలలో సరఫరా నిలిచిపోతుందని లెలిపారు. ఆ ప్రాంతంలోని వినియోగదారులు అందరూ సహకరించాలని కోరారు.

## హెచ్ఐవి బాధితులను ఆదుకోండి

**బొబ్బిలి :** హెచ్ఐవి బాధితులను ఆదుకోవాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ రావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చాలా మంది హెచ్ఐవి బాధితులకు ప్రభుత్వం ఇచ్చే పింఛన్లు అందక, పౌష్టికాహారం కొనుక్కోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బాధితులకు దీర్ఘకాలిక పింఛన్లు, పౌష్టిక ఆహారం అందజేయాలని కోరారు.

## కృషి ఉంటే ఉద్యోగం సులభం

**బొబ్బిలి :** పట్టుదల, కృషి ఉంటే సులభంగా ఉద్యోగాలు సాధించవచ్చునని కోచ్ రావు శ్రీనివాసరావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు అన్నారు. వీర బొబ్బిలి క్రీడా మైదానంలో ఉచిత శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు శుక్రవారం కోచ్ రావు శ్రీనివాసరావును సన్మానించారు. ఈసందర్భంగా కోచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ బొబ్బిలి ప్రాంతానికి చెందిన యువత ఉద్యోగాలు సాధించాలని లక్ష్యంతో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ తీసుకుంటున్న అనేకమంది ఆర్మీ, నేవీ, పోలీస్ డిపార్ట్మెంట్లలో ఉద్యోగాలు సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రేపు ఎన్‌జిఒ ఉద్యోగుల ఎన్నిక

**బొబ్బిలి :** ఎన్‌జిఒ హోమ్‌లో ఆదివారం ఎన్‌జిఒ ఉద్యోగుల సంఘం ఎన్నిక జరుగుతుందని బొబ్బిలి తాలూక కార్యదర్శి బి.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికకు బొబ్బిలి పట్టణ, రూరల్, సీతానగరం, బలిజిపేట మండల ఉద్యోగులు హాజరవ్వాలని కోరారు. ఎన్నికల అధికారిగా జె. విక్టర్ వ్యవహరిస్తారని చెప్పారు.

## బానిస వ్యవస్థలో అనేక ఇబ్బందులు

**శృంగవరపుకోట :** బానిస వ్యవస్థలో ప్రజలను అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బానిసత్వ నిర్మూలన దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ బానిస వ్యవస్థ మధ్యయుగ భారతదేశ కాలం నుండి అమల్లో ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత స్వేచ్ఛ, సమానత్వం వచ్చాయని తెలిపారు. బానిస వ్యవస్థ రద్దుకోసం అనేక పోరాటాలు సాగాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు చల్లా శ్రీనివాసరావు, కె.వాసుదేవరావు, భాస్కర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పింఛనుపై ఫిర్యాదు

**వేపాడ :** మండలంలో డిఆర్‌పేటకు చెందిన తాడి కృష్ణ తప్పుడు వికలాంగ ధ్రువపత్రంపై పింఛను పొందుతున్నట్లు దండుపాటి సత్తిబాబు, చామంతులు గంగాధర్ ఎంపిడిఒ కార్యాలయంలో ఫిర్యాదుచేశారు. ఈ మేరకు సీనియర్ అసిస్టెంట్‌కు ఫిర్యాదు అందించారు.

## కెజిపూడిలో ఫ్యామిలీ డాక్టర్

**వేపాడ :** మండలంలోని కెజిపూడిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 28 మందికి బొద్దాం పిహెచ్‌సి వైద్యాధికారి ఎల్.రమాదేవి వైద్య పరీక్షలు చేసి, మందులిచ్చారు. ఎంఎల్‌పి హెచ్ సత్య, ఎఎన్ఎం అప్పయమ్మ, హెచ్‌ఎ శేఖర్, డిఇఒ కె.మోహన్, కె.సతీష్, ఆశాలు అబద్ధం, పోలమ్మ, సావిత్రి పాల్గొన్నారు.

## గర్భిణులకు పోషకాహారం పంపిణీ

**వేపాడ :** మండలంలోని వావిలపాడు గ్రామంలో అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సర్పంచ్ బీల రాజేశ్వరి పౌష్టికాహారం పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహారాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## ఆర్థిక స్వావలంబన సాధించాలి

**విజయనగరంటౌన్ :** మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ఎదగాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. శుక్రవారం పువ్వాడ స్కూల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన భారతి బొటిక్యు గార్మెంట్ షోరూంను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల మనోభావాలకు అనుగుణంగా సరికొత్త డిజైన్లతో, నాణ్యమైన వస్త్రాలను, అందుబాటు ధరలో మహిళలకు అందించాలన్నారు.

## ఎస్ఎస్‌వి ఆర్థిక సాయం

**నెల్లిమర్ల :** సారిపల్లి సామాజిక వేదిక వాట్సాప్ గ్రూప్ సభ్యులు ఆ గ్రామానికి చెందిన బండారు బ్రహ్మానందం కుటుంబానికి శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. ఇటీవల కిడ్నీ సమస్యతో శివాలయం అర్చకులుగా పనిచేస్తున్న బండారు బ్రహ్మానందం మృతిచెందారు. దీంతో ఆ కుటుంబానికి రూ.75 వేలు సాయం అందజేశారు.

# ప్రజలకు 'ఇదేం కర్మ'

### టిడిపి ఆధ్వర్యాన పలు చోట్ల నిరసనలు

విజయనగరంకోట.. కలెక్టరేట్ వద్ద నిరసనలో పాల్గొన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర విభజన ప్రయోజనాలను సాధించడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు దుయ్యబట్టారు. ప్రజలకు 'ఇదేం ఖర్మ' అంటూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత అశోక్‌బంగ్లా నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. ఈసందర్భంగా అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడున్నర ఏళ్లయినా ప్రజల సమస్యలు తీర్చడంలో విఫలమైందని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. గిరిజన యూనివర్సిటీ కోసం గతంలోనే కేంద్ర ప్రభుత్వ బృందాలు క్లియరెన్స్ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు నిర్మాణానికి నోచుకోపోవడం వైసిపి ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. రైతులకు రుణాలు మంజూరు, సకాలంలో విత్తనాలు పంపిణీ, పంటకు గిట్టుబాటు ధర అందించడంలోనూ విఫలమైందన్నారు. జీతాలు కూడా సకాలంలో పొందకపోవడం ఉపాధ్యాయుల ఖర్మ అని అన్నారు. జైలుకెళ్లేవారంతా మహాత్మాగాంధీలు కాదని, ప్రజలు సొమ్ము లూటీ చేసి జైలుకెళ్లి వచ్చిన వారిని అందలమెక్కించడం మన ఖర్మ అని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ , బొద్దల నర్సింగరావు, కంది మురళీనాయుడు, కనకల మురళీమోహన్, మహిళా నాయకులు పాల్గొన్నారు.

**దత్తిరాజేరు :** మండలంలోని విజయరాంపురం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు ఆధ్వర్యాన ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి పెద్దింటి జగన్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.ఎ.నాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో అధికార పార్టీ చెప్పిన వారికి పొలం అమ్మకపోతే పింఛను తీసేస్తామని, ఉద్యోగం నుండి తొలగిస్తామని, ఇళ్ల బిల్లు ఆపివేస్తామని బెదిరించడం దారుణమన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్యలున్నా తెలియజేయాలని, అవి పరిష్కారమయ్యే వరకూ పోరాటం చేస్తామని తెలిపారు. అవసరమైతే కోర్టుకు వెళ్తామన్నారు. షికారుగంజి సచివాలయంలో విజయరాంపురం, షికారుగంజి గ్రామాల్లో సమస్యలపై దరఖాస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు పివివి గోపాలరాజు, మండల అధ్యక్షులు పెద్దింటి మోహనరావు, మాజీ జెడ్‌పిటిసిలు కొరుపోలు రమేష్ కుమార్, బండారు బాలాజీ, మాజీ ఎంపిపి బెజవాడ రాజేశ్వరి, నాయకులు అట్టాడ లక్ష్మునాయుడు, కోరాడ కృష్ణ, కొండపల్లి భాస్కరనాయుడు, అల్లు విజయ్ కుమార్, రొంగలి రమణమ్మ, గుంట్రోతు గోవింద, గుసిడి జగన్నాధం, వేమలి చైతన్య బాబు, మిత్తిరెడ్డి గౌరినాయుడు, చెల్లూరు సూర్యనారాయణ, నాగేశ్వరరావు, బెజ్జుపల్లి సూరి తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట.. సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే లలితకుమారి

**శృంగవరపుకోట :** శృంగవరపుకోట పట్టణంలో ఇదేం కర్మ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ప్రారంభించారు. దేవి కూడలి వద్ద మానవహారం నిర్వహించి, నినాదాలు చేశారు. 8, 9, 11, 14వ వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పెద్దవీధిలో రచ్చబండ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు, మహిళలు పాల్గొని వారి సమస్యలను తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పూసపాటిరేగ :** వైసిపి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు తెలిపారు. మండలంలోని వెంపడాంలో ఇదేం కర్మ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రజా వ్యతిరేక పాలనపై వివరించారు. ఈ ప్రభుత్వంలో మిమ్మల్ని బాధించే అంశాలను చెప్పాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వలేకపోతున్నారని ప్రభుత్వాన్ని విమర్శించారు. మోటార్లకు మీటర్లు అమర్చడం రైతు మెడకు ఉరివేయడమేనని చెప్పారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు మహంతి చిన్నంనాయుడు, మైలపల్లి సింహాచలం, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, మండల అధ్యక్షులు మహంతి శంకరరావు, నాయకులు పతివాడ తమ్మునాయుడు, మాజీ సర్పంచి పిన్నింటి శ్రీనివాసరావు, విక్రం జగన్నాథం, కొత్తకోట వెంకటరమణ, కొరటాన ప్రసాదరావు, పిన్నింటి సీతంనాయుడు, స్నేహ అప్పలనాయుడు పాల్గొన్నారు.

**నెల్లిమర్ల :** మండలంలోని వల్లూరులో టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్ ఆధ్వర్యాన ఇదేం కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్, తెలుగు మహిళా పార్లమెంట్ అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి మాట్లాడుతూ వైసిపి మూడున్నరేళ్ల పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదేల రాజారావు, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, తెలుగు యువత మండల అధ్యక్షులు నల్లం శ్రీనివాసరావు, వల్లూరు సర్పంచ్ పంచాది జయలక్ష్మి, లెంక అప్పల నాయుడు, టిడిపి పట్టణ కార్యదర్శి అవనాపు సత్యనారాయణ, ఎంపిటిసి చందక చిన్నంనాయుడు, నాయకులు బొంతు వెంకట రమణ, రెడ్డి సత్యం, లెంక సన్యాసిరావు, సారిపల్లి బాబూరావు, రెడ్డి వేణు దన్నాన రామ్మూర్తి, పొట్నూరు లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.

**భోగాపురం :** మండలంలోని రావాడ గ్రామంలో టిడిపి నాయకులు ఇదేం కర్మ కార్యక్రమంలో భాగంగా రహదారిపై అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. మాజీమంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యాన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాలనతో ఎంతో నష్టపోతున్నామని, అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు మహిళలు టిడిపి నాయకులకు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్రోతు రాజు, పిడుగు తోటరావ్, దాసరి అప్పలస్వామి, కోరాడ తాతారావు, తోగులు రెడ్డి, అప్పలసూరి, రావాడ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

**డెంకాడ :** మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామి నాయుడు ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మండలంలోని రాజుల తమ్మాపురం, పేడాడ గ్రామాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, మాజీ ఎంపిపి కంది చంద్ర శేఖర్ రావు, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కర్‌రావు, నాయకులు పతివాడ అప్పలనాయుడు, ప్రదీప్ రాజు, చిల్ల పద్మ, పడాల చిన్నారావు, సంఘం సురేష్, దాట్ల చిట్టిరాజు, కాకర్లపూడి శంకర్రావు రాజు, చిక్కాల శేషగిరి, కలిదిండి సన్యాసిరాజు, ఆవాల సంతోష్ పాల్గొన్నారు.

### 'ఇదేం కర్మ'ను విజయవంతం చేయాలి

**రేగిడి :** మండలంలో నిర్వహించే ఇదేం కర్మ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి కోండ్రు మురళీ మోహన్ కోరారు. శుక్రవారం ఉంగరాడమెట్ట తోటలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముందుగా ఇదేం కర్మ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు కిమిడి అశోక్ కుమార్, డిసిసిబి మాజీ ఉపాధ్యక్షులు దూబ ధర్మారావు, తెలుగు యువత మండల అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మాజీ జెడ్‌పిటిసి ఎం.ఉషారాణి, నారు జనార్ధనరావు, నాయకులు కర్నేన మహేష్, శాసపు గోవిందనాయుడు, కెంబూరు కోటినాయుడు, గేదెల బాలమురళి, గిరడ సింహాచలం పాల్గొన్నారు.

పూసపాటిరేగ.. వెంపడాంలో పర్యటిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

# క్షయ రోగులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

పౌష్టికాహారం తోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం నగరంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధానమంత్రి టిబి ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో టిబి రోగులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. వ్యాధిగ్రస్తులంతా క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకొని వైద్యులు ఇచ్చిన మందులు వాడుకోవాలని సూచించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు జె.సి.రాజు మాట్లాడుతూ తాము దత్తత తీసుకున్న టి.బి వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పాటు పౌష్టికాహారాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, డాక్టర్ శశిభూషణ్ రావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు అప్పారావు, తూముల రాణి పాల్గొన్నారు.

**డెంకాడ :** ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ సందర్భంగా డెంకాడలోని క్షయ రోగులకు రొంగలి సత్యవతి సర్వీస్ సొసైటీ చైర్మన్ కనక సింహాచలం, ఆయన తనయుడు చంద్రశేఖర్ శుక్రవారం బలవర్ధక ఆహారం పంపిణీ చేశారు. రోగులకు నెలకు సరిపడా పౌష్టికాహార పదార్థాలను అందజేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు పావని, వైస్ సర్పంచ్ ఆదినారాయణ, ఎఎంసి మాజీ డైరెక్టర్ గోపాలకష్ణ, పిఎసిఎస్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణరావు, పి.శ్రీనివాసరావు, సూరిబాబు, సత్యారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డెంకాడ.. క్షయ రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న రొంగలి కనక సింహాచలం

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ గణపతిరావు

# ఓటర్ల జాబితా సవరణకు సహకరించండి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో జరుగుతున్న ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమానికి రాజకీయ పార్టీలు సహకరించాలని డిఆర్ఒ ఎం.గణపతిరావు విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పుల కోసం, కొత్త ఓటర్ల నమోదు కోసం ఈనెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, ప్రజల్లోకి ఈ అంశాన్ని విస్తృతంగా తీసుకువెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా చొరవ చూపాలని కోరారు. శుక్రవారం జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 3, 4 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**ఓటరు నమోదుకు స్పెషల్ డ్రైవ్**

**బొబ్బిలి :** ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్‌డిఒ పి.శేష శైలజ స్పష్టం చేశారు. శుక్రవారం తన ఛాంబర్లో డివిజన్ పరిధిలోని తహశీల్దారులు ఇతర సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా డిసెంబర్ 3 4 తేదీలలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు 18ఏళ్లు నిండిన వారిని తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు చేయడం, ఇంటింటి సర్వే చేసి వివరాలు సేకరించడం, ఆధార్ ను ఓటు కు అనుసంధానం చేయడం చేయాలని ఆర్డీవో ఆదేశించారు. తహశీల్దార్లు రాజారావు, గణపతి రావు, మురళి, రాజేశ్వరరావు రావు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న రోగికి పింఛను అందజేత

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరానికి సమీపంలోని ఎం.లింగాలవలసకు చెందిన గుడివాడ చిన్నయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఆయనను కుటుంబ సభ్యులు విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆసరాగా అందిస్తోన్న వైఎస్సార్ పింఛను కానుక పథకంలో లబ్ధిదారుడైన చిన్నయ్యకు స్థానిక వాలంటీర్ మజ్జి నారాయణమ్మ శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి అందజేసింది.

## న్యాయవాదులపై దాడికి ఖండన

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లో న్యాయవాదులపై భౌతిక దాడులు, హత్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆంధ్ర లాయర్స్ అషోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలికి చెందిన న్యాయవాది తుమరాడ గంగాధర్ అన్నారు. శుక్రవారం 'ఐ డిమాండ్ ఫర్ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్' అంటూ నిరసన తెలిపారు. ప్రస్తుత రోజుల్లో న్యాయవాదుల గృహాలపై అనుమతి లేకుండా చొరబడడం, చరవాణీల ద్వారా బెదిరింపులకు పాల్పడడం, కోర్టు ఆవరణంలో ప్రత్యక్ష వాగ్వాదాలకు దిగడం, పరిపాటిగా మారాయని పేర్కొన్నారు. న్యాయవాదులకు రక్షణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం తేవాలని కోరారు.

## 'అవంతి'లో ఘనంగా ఫ్రెషర్స్‌డే

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని బసవపాలెం వద్దనున్న అవంతి కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ అవంతి కళాశాలలను యూనివర్సిటీ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వెంకీ మామ ఫ్రేమ్ సింగర్స్ మోహన్, అఖిల తమ పాటలతో విద్యార్థులను ఉర్రూతలు ఊగించారు. విద్యార్థులతోపాటు కళాశాల డైరెక్టర్ రాఘవరావు డాన్సులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎయు రిజిస్ట్రార్ కృష్ణమోహన్, చందు సుబ్బారావు పాల్గొన్నారు.

ఫ్రెషర్స్‌డేలో విద్యార్థుల సందడి

## కోళ్ల పెంపకంతో ఆర్థిక చేయూత

ప్రజాశక్తి -భోగాపురం

పెరటి కోళ్ల పెంపకం ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుందని వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ తెలిపారు. వీటి ద్వారా మహిళా సంఘాల సభ్యులకు అదనపు ఆదాయం చేకూరుతుందన్నారు. శుక్రవారం మండలంలోని సవరవిల్లిలో వైఎస్ఆర్ క్రాంతి పథం ద్వారా పెరటికోళ్లను ఆయన అందజేశారు. అనంతరం ఎపిఎం రమణ మాట్లాడుతూ మండలంలో 50 యూనిట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఒక్కొక్క యూనిట్ ధర రూ.4 వేలు అన్నారు. యూనిట్ కింద 11 కోళ్లను ఇస్తున్నట్లు తెలిపారు. యూనిట్‌తోపాటు 30 కిలోల దాణా, అవసరమైన మందులను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సవరవిల్లి గ్రామ సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కర్ రెడ్డి, ఎంపిటిసి పట్నా తాతయ్యలు, ఎసి రాజకుమార్, ఎపిఎం ఎలమంచిలి రమణ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## దళిత సంఘాలకు నిరాశే : డిబిఎస్‌యు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలో పర్యటించిన ఎస్‌సి శాసన సభా కమిటీ చైర్మన్ జిల్లాలోగల దళిత సంఘాలతో ఎటువంటి సమావేశం నిర్వహించి వినతులు స్వీకరించక పోవడం, జిల్లాలో దళితులు ఎదుర్కొనే ప్రధాన సమస్యలను గుర్తించక పోవటం చాలా అన్యాయమని దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు అన్నారు. శుక్రవారం డిబిఎస్‌యు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేకేళ్లుగా శాసన సభా కమిటీ చైర్మన్‌లు జిల్లాకు పర్యటనకు వచ్చినా, సమీక్షలు నిర్వహించినా, ముందుగా జిల్లాలో దళిత సంఘాలతో చర్చించి, వినతి పత్రాలు తీసుకొని ,తదుపరి అధికారులతో సమీక్షలు నిర్వహించేవారని చెప్పారు. కానీ గొల్ల బాబూరావు నాయకత్వం లో ఇపుడు వచ్చిన కమిటీ ఈ పద్ధతికి మంగళం పాడి, రహస్యంగా నాలుగు గోడల మధ్య అధికార్లతో సమావేశం నిర్వహించటం చాలా విడ్డూరంగా వుందని అన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు కోరుకొండ వరలక్ష్మీ, ఎన్.వర ప్రసాద్, నీలపు కలావతి పాల్గొన్నారు

## రోడ్డు మధ్యలో భారీ రంధ్రం

### రాకపోకలకు ఆటంకం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో చామలాపల్లి పంచాయతీలో వెంకయ్యపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డుకు మధ్యలో భారీ రంధ్రం పడింది. దీంతో చామలాపల్లి నుంచి వెంకయ్యపాలెం వెళ్లేందుకు వాహనాలకు అవకాశం లేదు. అధికారులు స్పందించి వెంకయ్యపాలెం గిరిజనుల రాకపోకలకు ఆటంకం లేకుండా చూడాలని కోలా సతీష్ కోరారు.

## తడి, పొడి చెత్తపై అవగాహన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వీలుపర్తి సచివాలయ సిబ్బందికి, పారిశుధ్య కార్మికులకు ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. కార్యాలయానికి వచ్చిన ప్రజల సమస్యలను సాధ్యమైనంత వరకు సచివాలయంలోనే పరిష్కారానికి కృషి చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం అనూష పాల్గొన్నారు.

## పార్టీ పటిష్టతకు మరింత కృషి

### జనసేన మండల అధ్యక్షులు పతివాడ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

గ్రామస్థాయిలో పార్టీ మరింత బలపడేందుకు కృషి చేస్తానని జనసేన మండల అధ్యక్షులు పతివాడ అచ్చెన్నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పార్టీ అధిష్టానం మండల కమిటీ ఏర్పాటు సందర్భంగా తనను జనసేన మండల అధ్యక్షులుగా నియమించినట్లు తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ కుటుంబంలో పుట్టిన తనను పార్టీ గుర్తించి మండల బాధ్యతలు అప్పగించిందని, అధిష్టానం సూచనల మేరకు గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత పటిష్ట పర్చడానికి కృషి చేస్తానని తెలిపారు. అధికార వైసిపి అక్రమాలు ప్రజల్లోకి తీసుకు వెళ్తానని చెప్పారు. కార్యకర్తలు, యువత సమన్వయంగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో జనసేన విజయమే లక్ష్యంగా దూసుకు వెళ్తామన్నారు. ఇప్పటికే అధికార పార్టీపై ప్రజల్లో భ్రమలు తొలగిపోయాయని తెలిపారు. సామాజిక న్యాయం, బిసిల రాజ్యాధికారం కోసం జనసేన నిరంతర పోరాటం చేస్తుందని తెలిపారు. మండల, గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి జనసేన పార్టీని ప్రజల్లోకి తీసుకు వెళ్లి బలోపేతం చేస్తామన్నారు.

## ధాన్యం కొనుగోలుపై అవగాహన

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలోని రాచకిండాం, కొండకిండాం, ఒంపల్లి గ్రామాల్లో శుక్రవారం తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపిడిఒ వేదవతి, ఎఒ మల్లికార్జునరావు ధాన్యం కొనుగోలుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రైతులు వరిపంట నూర్పిడి చేసిన అనంతరం ఆర్‌బికెలో సాంకేతిక సహాయకులకు తెలియజేయాలని వారు సూచించారు. తేమ శాతం, నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం రైతుల నుంచి ధాన్యం సేకరిస్తారని వివరించారు. హమాలీ, రవాణా ఖర్చులు, ధాన్యం బిల్లులతోపాటు చెల్లింపులు చేస్తామని చెప్పారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు మద్దతు సంస్థలుగా గొట్లాం, బొండపల్లి, రాచకిండాం పిఎసిఎస్‌లు ఉంటాయని ఎఒ మల్లికార్జునరావు తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ సంతోష్, సర్పంచ్ లండ నారాయణమ్మ, పెదమజ్జి గోపి, చౌక్కాకు నారాయణరావు, కార్యదర్శి కెబిఎల్ కుమారి, లక్ష్మీప్రసన్న, రమాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

SPOT ADMISSIONS INTO MCA COURSE PROGRAMME
RAJAH RSRK RANGA RAO COLLEGE MCA CENTRE::BOBBILI
(Affiliated to Andhra University)
Near RTC Complex, Bobbili-535 558, Ph. No.9247110149, 8500038444

AP-ICET-2022 SPOT ADMISSION (CAT-A) AND
MANAGEMENT QUOTA (CAT-B)
(MCA COURSE DURATION 2 YEARS ONLY)

FOR "A" Category seats (Convener quota, Spot Admissions)
Available Vacancies: Conv.:05, EWS :01
AND "B" Category Seats (Management Quota)
Available Vacancies: MCA: 18

College ICET Code
RANG

For Further Details Contact : 9866646580, 8186092999
TUTION FEE: 27,000/- for "A" and "B" Category Seats (No Building Fund)
Eligible Candidates may be present at the Principal Office along with all Original certificates along with fee on or before 08-12-2022 at 5.00 P.M.
PRINCIPAL